

# తెలంగాణ వైతాళికుడు
# శ్రీ సురవరం ప్రతాపరెడ్డి

**1896 - 1953**

**సురవరం తెలుగు సాహిత్య సరోవరం! తెలంగాణకు వరం!!**

**సురవరంప్రతాప రెడ్డి గారు తొలి తెలంగాణ వైతాళికులు ! తెలుగు భాషా సరస్వతి కంఠ సీమలో మణిహారం!**

సాంఘిక ఉద్యమ శీలి, సాహితీవేత్త, చరిత్రకారుడు, కవి, రచయిత, న్యాయవాది, పాత్రికేయుడు, సంపాదకుడు, సామాజిక సంస్కర్త మరియు వివిధ సామాజిక-సాంస్కృతిక విద్యా సంస్థల వ్యవస్థాపకుడిగా పరిశ్రమించిన అసాధారణ వ్యక్తి. ఆయన కలం సాహిత్యంలోని అన్ని ప్రక్రియలను పద్యం, గద్యం, నాటకం, నవల, జీవిత చరిత్ర, చారిత్రక పరిశోధనాది రంగాలను సుసంపన్నం చేసింది, ప్రభావితం చేసింది!

నిజాం నిరంకుశ పాలనలో తెలంగాణలో పౌరుషాగ్ని రగిలించిన సాహసికుడు! అటువంటి విపత్కర పరిస్థితుల్లో నిద్రాణమైన తెలుగుజాతిని తట్టి లేపేందుకు ఉవ్వెత్తున ఎగిసిన కలం కెరటం సురవరం ప్రతాప రెడ్డి, గోలకొండ పత్రిక సంపాదకత్వంతో తెలంగాణ ప్రజలకు సామాజిక, రాజకీయ విజ్ఞాన సమాచారాన్ని ప్రసాదించిన ప్రజ్ఞావంతుడు! పాత్రికేయ వృత్తి ద్వారా తెలుగు నేలలో అపూర్వ చైతన్యాన్ని నిర్మించి ప్రతాపరెడ్డి పథం ప్రజాహితమే అన్న పేరు గడించారు.

ప్రతాపరెడ్డి గారు రాజా బహదూర్ వెంకట రామరెడ్డి వసతి గృహ ఉప కార్యదర్శిగా ఎందరో విద్యార్థుల భవిష్యత్తు తీర్చి దిద్దారు.

ఆంధ్రుల సాంఘిక చరిత్ర రచనతో తొలి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును సొంతం చేసుకున్న పరిశోధనా ప్రౌఢిమ గల ప్రతిభావంతుడు. హిందువుల పండుగలు, హైందవ ధర్మవీరులు, యువజన విజ్ఞానం, గోలకొండ కవుల సంచిక, రామాయణ విశేషములు వంటి ఎన్నో గ్రంథాలను ఆధునిక విమర్శనా దృక్పథంతో రచించి తెలుగు సాహిత్యానికి వన్నె తరగని ఆభరణాలుగా అలంకరించి అభినందనలు అందుకున్న మహా మనీషి సురవరం ప్రతాప రెడ్డి.

తన రచనా పాటవంతో, కార్యదీక్షతో ప్రధానంగా తెలంగాణ ప్రజల్ని జాగృత పరిచి తెలుగు సంస్కృతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు. నిస్వార్థ రాజకీయ నాయకుడిగా, పలు సంస్థల స్థాపకుడిగా, సారస్వత భగీరథుడిగా సురవరం చేసిన కృషి ఎనలేనిది.

ఒక వ్యక్తి వంద సంవత్సరాల జీవితంలో నెరవేర్చలేని అసమాన కార్యశీలతతో 57 సంవత్సరాల స్వల్ప జీవితంలో నిర్వహించి, భావితరాలకు ఆదర్శప్రాయుడుగా, ఆచరణీయుడగా, పూజనీయుడుగా మిగిలాడు. ఆయన చరిత్ర ధన్యమైనది !!!

# బహుముఖ ప్రతిభావంతుడు - శ్రీ సురవరం ప్రతాపరెడ్డి

తెలంగాణ వైతాళికుడిగా ప్రసిద్ధి గాంచిన సురవరం ప్రతాపరెడ్డి స్వాతంత్రోద్యమ యోధునిగా, సామాజిక చరిత్రకారుడిగా, రచయితగా, విద్వాంసునిగా, సంఘసంస్కర్తగా, కవిగా, న్యాయవాదిగా, పాత్రికేయుడిగా, సంపాదకుడిగా, సాంఘిక సాహిత్య, విద్యాసంస్థల వ్యవస్థాపకుడిగా పరిశ్రమించిన అసాధారణ వ్యక్తి.

ఆనాటి నిజాం రాష్ట్రంలో నానాటికి తెరమరగవుతున్న తెలుగు విద్య, సాహిత్యం సంస్కృతులను గమనించి, బాధపడి వాటి పునరుద్ధారణకు కంకణం కట్టుకొని, అహర్నిశం శ్రమించి తెలుగు భాషను, తెలుగు విద్యాబోధనను, సాహిత్యాన్ని, సంఘోద్ధారణను, పత్రికా నిర్వహణను పునరుజ్జీవింపజేసిన ధన్యజీవి.

ఆయన పేరు తలచుకుంటే చాలు తెలంగాణ ప్రాంతంలో ఆయన మేల్కొల్పిన సామాజిక అవగాహన, సంఘ సంస్కరణలు గుర్తుకొస్తాయి. స్త్రీలకు విద్య, కులమతవర్గ రాహిత్యం, అందరికీ ఆలయ ప్రవేశం, బాల్య వివాహనిషేధం, వితంతు వివాహాల ప్రోత్సాహం గురించి ఆయన నిరంతరం శ్రమించారు.

అనేక ఇక్కట్లను, ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి, ఆయన హైదరాబాదులో మొదటి తెలుగు వార్తా పత్రిక 'గోలకొండ పత్రిక'ను ప్రారంభించగలిగారు. ప్రజలను ఆకర్షించి, ఆలోచింపజేయగలదని, వారి మనసుకు హత్తుకునేది వార్తాపత్రిక మాత్రమేనని ఆయన భావించారు.

పత్రికా సంపాదకునిగా, బహు సంస్థల స్థాపకుడిగా, ఉత్తమాభి రుచి గలిగిన రచయితగా, విశాలంధ్రోద్యమ దీపశిఖలా ఆయన పనితనం అందరి ప్రశంసలకు పాత్రమయింది.

ఆయన ఎంత శేముషీవిభవుడో అంతటి నిగర్వి, నిరాడంబరుడు, గంబీరుడు ఆయన రచించిన 40 పైగా రచనలలో ముఖ్యమైనవి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'. (ఇది కేంద్ర సాహిత్య అకాడమి, న్యూఢిల్లీ వారి పురస్కారం అందుకున్న మొదటి తెలుగు భాషా గ్రంథం). రామాయణ విశేషములు, హిందువుల పండగలు, హైందవ ధర్మ వీరులు మొదలైనవి.

ఆయన బహుభాషావేత్త, తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ, పెర్షియన్ భాషలు ఆయనకు కరతలామలకం, తమిళం, కన్నడం కూడ తెలుసు.

హైదరాబాదు శాసనసభకు ఎం.ఎల్.ఎ.గా వనపర్తి నియోజకవర్గం నుండి 1952 లో ఎన్నికైనారు. దురదృష్ట వశాత్తు తన 57వ ఏట 25-8-1953న స్వర్గస్తులైనారు.

ఈ రోజుకీ ప్రతాప రెడ్డి గారి జీవితం, రచనలపై పుస్తకాలు వస్తూనే వున్నాయి. ఆయన రచనలలోని అనేక ముఖ్య విషయాలను వివిధ రచయితలు తమ రచనలలో ప్రస్తావిస్తున్నారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఆయన పుస్తకాలను పాఠ్య గ్రంథాలుగా నిర్ణయించారు. హైస్కూలు, కళాశాలల పుస్తకాలలో ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చారు. ఇలా యీ నాటికీ ఆయన మన మధ్య నిలిచి పోతున్నారు.

తన జీవితాంతం ప్రతాపరెడ్డిగారు తెలుగు ప్రజలకు, సమాజానికి చేసిన నిస్వార్థ సేవలు, సాధించిన ఆశయాలు, విజయాలకు గుర్తింపుగా, అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు హైదరాబాదు హుసేన్ సాగర్ టాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన ఆంధ్రుల చరిత్రలోని మహనీయులు విగ్రహాల సరసన ప్రతాపరెడ్డిగారి విగ్రహాన్ని కూడ ఏర్పాటు చేశారు. ఇదిగాక యింకా మహబూబ్‌నగర్, పనపర్తి, గద్వాల, ఇటిక్యాల పాడుల్లో ఆయన విగ్రహాలు ఆవిష్కరింపబడ్డాయి. సికిందరాబాదులోని టెలికాం భవనానికి ప్రతాప రెడ్డి పేరు పెట్టారు. హైదరాబాదులోని ఒక బిరుదానంతర కళాశాలకు వారి పేరు పెట్టబడింది. హైదరాబాదు ప్రెస్‌క్లబ్‌కు ప్రతాప రెడ్డి గారి పేరు ఉన్నది. తెలుగు విశ్వవిద్యాలయానికి ఆయన పేరుంచాలన్న ప్రతిపాదన కూడా ఉంది.

## బాల్యం, విద్యాభ్యాసం, విద్యాసంస్థల, గ్రంథాలయాల సేవ

తెలంగాణ రాష్ట్రంలోని ఇప్పటి జోగులాంబ-గద్వాల జిల్లాలోని బోరవెల్లి గ్రామంలో మాతామహుల యింట ప్రతాప రెడ్డి గారు 1896వ సంవత్సరం మే నెల 28న జన్మించారు. వారి తల్లిదండ్రులు రంగమ్మ, నారాయణరెడ్డి గార్లు.

ఏడు సంవత్సరముల వయసు వరకు బోరవెల్లిలోనే ఉండి, తరువాత స్వగ్రామమైన ఇటిక్యాల పాడుకు చేరారు. తండ్రిగారే ఆద్య గురువు. దీనితోపాటు స్థానిక ఉపాధ్యాయులు తెలుగు, సంస్కృతం నేర్పారు. పినతండ్రి రామకృష్ణారెడ్డి గారి ప్రోద్బలంతో కర్నూలు చేరి అక్కడ హైస్కూలు చదువు పూర్తి చేశారు. తదుపరి హైదరాబాదు నిజాం కళాశాలలో ఎఫ్.ఎ. ఆపై మదరాసు ప్రెసిడెన్సీ కళాశాలలో బి.ఎ., తదుపరి బి.ఎల్ కూడ ఉత్తీర్ణులయ్యారు. చిన్నప్పటి నుండి తెలుగు, సంస్కృత భాషలపై మక్కువతో బి.ఎ.లో సంస్కృతం ద్వితీయ భాషగా చదివారు. మదరాసులో ఉండగానే వివిధ పత్రికలకు వ్యాసాలు వ్రాసి పంపేవారు. అవి ముద్రితమైనాయి కూడా. అక్కడే ప్రతాప రెడ్డి గారు స్థానిక సాహితీ ప్రముఖులతో పరిచయాలు కూడ చేసుకున్నారు.

మదరాసు నుండి 'లా' డిగ్రీతో తిరిగి వచ్చిన తరువాత పినతండ్రి గారి ప్రోత్సాహంతో న్యాయవాద వృత్తిని చేపట్టవలసి వచ్చింది. కాని దానిపై మనసు పెట్టలేదు. ఇంతలో ఆయన హైదరాబాద్ కొత్వాల్ (ఇప్పటి పోలీస్ కమిషనర్)గా ఉన్న రాజబహద్దురు వేంకటరామా రెడ్డి గారిని కలుసుకోవలసి వచ్చింది. ఆ సమావేశంలో ప్రతాప రెడ్డి గారిని కొత్వాల్ గారు హైదరాబాదులో ఉన్న రెడ్డి విద్యార్థి వసతి గృహ కార్యదర్శిగా నియమించారు. ఈ వసతి గృహాన్ని కొత్వాల్ గారే బీద విద్యార్థుల సౌకర్యార్థం 1918లో ప్రారంభించారు.

ప్రతాప రెడ్డి గారు వసతి గృహానికి 1925–1934 మధ్య పనిచేసిన కాలంలో విద్యార్థులకు క్రమశిక్షణను అలవాటు చేసి వారి చదువులకు, వ్యాయామానికి, ఆటలకు సౌకర్యాలు కలగజేశారు. అన్నిటికంటె వసతి గృహ గ్రంథాలయాన్ని ఎంతో అభివృద్ధి పరచి ఎన్నో నూతన పుస్తకాలు, తాళపత్ర గ్రంధాలు సేకరించి హైదరాబాదులోని మేటి గ్రంథాలయాల్లో ఒకటిగా తీర్చిదిద్దారు. తదుపరి ఈ గ్రంథాలయానికి సురవరం ప్రతాప రెడ్డి గారి పేరు, వసతి గృహానికి రాజబహద్దురు వేంకటరామారెడ్డి గారి పేరు పెట్టారు.

సురవరం ప్రతాప రెడ్డి గారు వసతి గృహ కార్యదర్శిగా వున్న కాలంలో సర్ ఎస్. రాధాకృష్ణన్, సర్ సి. ఆర్. రెడ్డి, దువ్వూరి రామిరెడ్డి, పానుగంటి కాశీనాథ్ వంటి ఎంతో ప్రముఖులు దానిని దర్శించారు. అట్టివారి చేత విద్యార్థులకు ఉత్సాహప్రేరితమైన ఉపన్యాసాలను యిప్పించేవారు. ఉత్తేజితులైన విద్యార్థులు స్వాతంత్ర్యోద్యమంలోను నిజాం వ్యతిరేక ఉద్యమంలోను చురుకుగా పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమాలకు వసతి గృహం వేదికగా మారిందని నిజాం ప్రభుత్వం, ఆనాటి బ్రిటిష్ అధికారులు ఆగ్రహం చెంది ఏదోమిషపై సురవరం వారిని కార్యదర్శిపదవినుండి తప్పుకునేట్లు చేశారు.

శతాబ్దానికి పైగా వసతి గృహంలో నివసిస్తూ విద్యాభ్యాసం పూర్తి చేసిన వేలాదిమంది యువకులు ఇంజినీర్లుగా, డాక్టర్లుగా, పారిశ్రామికవేత్తలుగా, సంఘసేవకులుగా, రచయితలుగా, రాజకీయ నాయకులుగా బహుముఖంగా పేరుగాంచారు.

తరువాతి కాలంలో ప్రతాప రెడ్డి గారు పలు విద్యాసంస్థలకు సహాయ, సహకారములు అందించడమే గాక 1944 సం॥లో ఆంధ్రవిద్యాలయ స్థాపనకు కారణభూతులయ్యారు. ఈ సంస్థ దినదిన ప్రవర్ధమానమై హైస్కూలుగా, కళాశాలగా, బిరుదానంతర విద్యాకళాశాలగా అభివృద్ధి చెంది హైదరాబాదులోని ప్రముఖ కళాశాలలలో ఒకటిగా వెలుగొందుతున్నది.

సురవరం ప్రతాప రెడ్డి గారు గ్రంథాలయోద్యమంలో చురుకుగా పాల్గొని ప్రముఖ పాత్రవహించారు. గ్రంథాలయాల ప్రాముఖ్యత గురించి రాష్ట్రమంతా ఉపన్యాసాలు యిచ్చారు. హైదరాబాదు నాంపల్లిలోని వేమన గ్రంథాలయం, గౌలిగూడలోని బాలసరస్వతి గ్రంథాలయం, శాలిబండలోని గుణవర్ధక గ్రంథాలయం కాక ఆలంపురంలోను, తదితర పట్టణాలలోను గ్రంధాలయాల స్థాపనకు కారకులయ్యారు.

తాళపత్రగ్రంథాలను పరిష్కరించడంలోను, ఎన్నో పుస్తకాల ప్రచురణలోను ఆయన విశేషకృషి చేశారు. శ్రీకృష్ణదేవరాయంధ్రభాషానిలయానికి అనేక గ్రంధాలు సేకరించారు. ఆయన వద్ద నున్న స్వంత గ్రంథాలయంలో సింహభాగం

హైదరాబాదు (కేంద్ర) విశ్వవిద్యాలయం తెలుగుశాఖకు బహూకరించగా అది ఇప్పటికీ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పరిశోధకులకు బహువిధాలుగా ఉపకరిస్తున్నది.

## గోలకొండ పత్రిక స్థాపకుడిగా పాత్రికేయుడుగా, సంపాదకుడిగా సురవరం

ప్రతాపరెడ్డి గారు రెడ్డి విద్యార్థి వసతి గృహ కార్యదర్శిగా పనిచేస్తూనే రాజా బహద్దురు వేంకటరామారెడ్డి గారి సహాయ, సహకారములతో 'గోలకొండ పత్రిక' స్థాపన జరిగింది. వారానికి రెండుసార్లుగా వచ్చే ఈ పత్రిక మొదటి సంచిక 1926వ సం॥ మే నెల 10వ తేదీన ఆవిర్భవించింది. తమ పత్రిక ఆశయాలకు మొదటి సంచికలోనే ఈ విధంగా నివేదించారు ప్రతాపరెడ్డిగారు.

1. **తెలుగు భాషా సేవ**
2. **కుల, మత, ప్రాంతీయ, వర్గభేదాలు లేకుండా తెలుగు ప్రజలందరి అభివృద్ధికి కృషి చేయుట.**

ఆ రోజులలో తెలుగు భాష, సంస్కృతి, తెలుగు ప్రజల దుర్భర పరిస్థితిని గురించి ఈ నాటి ప్రజలు తెలుసుకోవడం ఎంతో అవసరం. తెలుగు మాతృభాషగా వున్న ప్రజలు జనాభా నూటికి 80 మంది వున్నా తెలుగు భాషకు ఆదరణ మృగ్యం. తెలుగు బోధించే పాఠశాలలు దాదాపు లేవనే చెప్పాలి. రాజభాష ఉర్దూ, ప్రభుత్వ కార్యకలాపాలు, లావాదేవీలు అన్నీ ఆ భాషలోనే జరిగేవి. ప్రభుత్వం తరపున తెలుగు పాఠశాలలు లేకపోగా స్థానికులు పాఠశాలలు స్థాపించుకోవాలనుకున్నా ప్రభుత్వ సహకారం ఉండేది కాదు. దీనితో తెలుగువారికి తమ భాషంటే ఒక విధమైన ఉదాసీనత, ఉపేక్షాభావం నెలకొన్నది. ఉర్దూతో ప్రభుత్వమెప్పు పొందవచ్చుననే భావన ఉండేది. అందుచేత తెలుగు వారు కూడ ఉర్దూలో మాట్లాడడానికి ప్రయత్నించడం, (చదవలేకపోయినా) ఉర్దూ పత్రికను చేతపట్టుకోవడం, ముస్లింల మాదిరి టోపీ, వేషం ఒక భ్రమగా తయారయింది.

ఈ పరిస్థితులను నిశితంగా గమనించిన ప్రతాప రెడ్డి గారు, ఎంతో మనోవ్యధ చెంది, దీనికి విరుగుడు పత్రికా నిర్వహణ ద్వారానే సాధ్యమన్న నిశ్చితాభిప్రాయానికి వచ్చి, పైన చెప్పినట్టుగా పత్రికను ప్రారంభించారు.

పత్రికను ప్రరంభించిన తొలిరోజులలో ప్రతాప రెడ్డి గారే సంపాదకుడిగా, విలేకరిగా, కంపోజర్‌గా, ప్రూఫ్‌రీడర్‌గా, గుమాస్తాగా తుదకు తపాలం బిళ్ళలను అంటించి పత్రికను పోస్టు చేయ్యడం వరకు అన్నీ తానైచేయవలసివచ్చేది.

ఆ రోజులలో రచయితలుగాని పత్రికా విలేకరులుగాని ఏ కొద్దిమందో ఉండేవారు. ఒకవేళ ఉన్నా అనుభవం అంతగా ఉండేదికాదు. పత్రికా విలేకరులుగా పనిచేయడానికి తను స్వయంగా పనినేర్పించేవారు. ఎవరూ వ్రాయనప్పుడు తానే చిత్ర గుప్త, భావ కవి, వెర్రిమంగళప్ప, యుగపతి, సింహాయిత్యాదికలం పేర్లతో వ్రాసి ప్రచురించేవారు. ఆయన దాదాపు 1500లు పైగా సంపాదకీయాలు, వ్యాసాలు వ్రాశారు.

మహిళా రచయితలను ప్రోత్సహించడానికి చాలా ప్రయత్నించేవారు. ఒకసారి ఆయనే ఒక కలం పేరుతో "స్త్రీలకు సంపూర్ణ స్వేచ్ఛ మిథ్యావాదము" అనే వ్యాసాన్ని వ్రాసి ప్రచురించారు. దానితో చాలమంది స్త్రీలు ఆగ్రహంతో వ్యాసాన్ని ఖండిస్తూ వ్రాస్తే వాటినన్నింటిని గోలకొండ పత్రికలో ప్రచురించారు. కొంతకాలం తురువాత ఇందుకు తానే కారకుడనని అసలు సంగతి వెల్లడించారు.

22 సంవత్సరాలకు పైగా గోలకొండ పత్రిక తెలుగు ప్రజల భాషాభివృద్ధికి, సాంఘిక పునరుజ్జీవనానికి, నిజాం పాలనను విమర్శిస్తూ ప్రముఖ పాత్రను పోసించి, విజయం సాధించిందనే చెప్పాలి.

బాధ్యతాయుతమైన, ప్రజాక్షేమం కోరే సంపాదకత్వం, నిర్దిష్టమైన భావాలు, ప్రజానురంజకమైన వ్రాతలు, విధానాలు సంఘాన్ని ఏవిధంగా ప్రాభావితం చేయగలవో చెప్పడానికి 'గోలకొండ పత్రిక' ఒక ఉదాహరణ, మార్గదర్శి.

సురవరం ప్రతాప రెడ్డి గారు తెలుగు ప్రజలదరికీ ఒకే రాష్ట్రం 'విశాలంధ్ర' ఉండాలని ఆకాంక్షించారు. 1930లో జోగిపేటలో జరిగిన 'నిజాం ఆంధ్రమహాసభ'కు ఆయన అధ్యక్షత వహించారు. 'తెలంగాణ ఆంధ్రోద్యమము' అనే పుస్తకం వ్రాసి

ప్రచురించారు. కాని చివరకు 'ఆంధ్రప్రదేశ్' ఏర్పడినా ఆయన చూడలేక పోయారు.

తెలంగాణలోని తెలుగు పత్రికా ప్రపంచంలో 'గోలకొండ పత్రిక' ఒక నూతనోధ్యాయం. దానిలో వెలుబుచ్చిన భావాలు ప్రజలలో విశ్వాసం, ప్రభుత్వానికి కలవరం కలిగించాయన్నది నిర్వివాదాంశం. ప్రజలుగాని, ప్రభుత్వం గాని దాన్ని మరువలేరు.

## సాంఘిక చరిత్రకారుడిగా, రచయితగా కవిగా ప్రతాప రెడ్డి

సురవరం ప్రతాప రెడ్డి అన్నీతానై గోలకొండ పత్రికను నడుపుతున్నప్పటికీ, తనపుస్తకం రచనా వ్యాసంగాన్ని కూడ కొనసాగించారు. ఆయన ముఖ్య రచనలన్నీ ఈ సమయంలోనే జరిగాయి. ఆయనకు పూర్వకవుల రచనలతోను, తాళపత్ర గ్రంథాలతోను విపుల పరిచయం ఉంది. దానికితోడు బహుభాషా వేత్త కాబట్టి ఆయన రచనా ప్రపంచం బహువిస్తారం. తెలుగు సాహిత్యశాఖలలో ఆయన ముట్టనది లేదు. ఆయన సృష్టిలో సాహిత్యవిమర్శ, పద్యకవిత్వం, కథలు, నాటకాలు, నవలలు, జీవిత చరిత్రలు, చారిత్రక, పరిశోధక గ్రంథాలెన్నో వచ్చాయి. పత్రికా సంపాదకునిగా ఆయన వ్రాసిన సంపాదకీయాలు, ఎన్నో పుస్తకాలకు సమకూర్చిన పీఠికలు యిత్యాదులు ఉన్నాయి. అన్నిటినీ మించి ఆయన గొప్ప వక్త, రాష్ట్రంలోను, ఇతర ప్రదేశాలలోను లెక్కలేనన్ని ఉపన్యాసాలు ఇచ్చారు. ఆయన ప్రథమ రచనలు శుద్ధ గ్రాంధికంలోనే జరిగినా, కాలానుగుణంగా వ్యవహారశైలికి మార్చుకున్నారు. కొన్ని రచనలలో తెలంగాణ వైవిధ్యం కూడా చూపించారు. వాటిలో కొన్నింటిని పరిచయం చేసుకుందాం.

### ఆంధ్రుల సాంఘిక చరిత్ర:

సురవరం ప్రతాప రెడ్డి గారి రచనలన్నీ ఒక ఎత్తయితే, ఆంధ్రుల సాంఘిక చరిత్ర మరొకటి అని పలువురి విమర్శకులు భావిస్తారు. ఆయన రచనలలో తలమానికమైనదంటారు.

ఈ రచన 1949 సం॥లో ప్రచురింపబడి తెలుగు వారి చరిత్ర సాహిత్యంలో ఒక క్రొత్త మలుపుకు నాంది పలికింది. అంతవరకు చరిత్ర రచన రాజులకు, రాణులకు, వారి రాజ్యాలకు, వాటి మధ్య యుద్ధాలకు పరిమితమై ఉండేది. ఈ పుస్తకంలో రెడ్డిగారు తూర్పు చాళుక్య యుగం మొదలు 1907 సం॥వరకు, అంటే ఇంచు మించు వెయ్యి సంవత్సరాలలో సామాన్య ప్రజలు ఎలా జీవించారో వారి ఆహారము, దుస్తులు, అలంకరణములు, ఆటలు, పాటలు, ఆచారములు యిత్యాదిదైనందిన జీవితాన్ని గురించి వివరించారు. విద్యాంసుల, చరిత్రకారుల ప్రశంసలకు పాత్రమయింది.

ఆంధ్రుల సాంఘిక చరిత్రకు కేంద్ర సాహిత్య అకాడమి, న్యూఢిల్లీ వారి 1955 సంవత్సర పురస్కారం లభించింది. ఇట్టి అపూర్వ గౌరవం పొందిన ప్రథమ తెలుగు భాషా గ్రంథమిది. ఈ పుస్తకం సివిల్ సర్వీసెస్ పరీక్షలకు పాఠ్యగ్రంథంగా నిర్ణయింపబడింది.

### హిందువుల పండుగలు:

మ.ఘ.వ. నిజాం గారి సందేహ నివృత్తికోసం, కొత్వాల్ రాజబహద్దురు వేంకటరామారెడ్డి గారి ఆజ్ఞమేరకు ఈ పుస్తకాన్ని ప్రతాప రెడ్డి గారు రచించారు. మనము పండుగలను ఎందుకు జరుపుకుంటున్నామో, దానివెనుకున్న శాస్త్రీయ, ఆధ్యాత్మిక, సామాజిక ప్రయోజనము లేమిటో మనలో చాలమందికి తెలియదు. రెడ్డి గారు అనేక శాస్త్రీయ, పౌరణిక గ్రంథాలను పరిశోధించి 55 పండుగల, వ్రతముల, ఉత్సవములను కారణాలతో వివరించారు.

ఈ గ్రంథానికి మనదేశ పూర్వాధ్యక్షులు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు పరిచయ వ్యాక్యాలు వ్రాశారు. ఇది 1931 సం॥లో ప్రచురితమైంది.

### గోలకొండ కవుల సంచిక : 1934

ముడుంబై వేంకటరాఘవాచార్యులు అనే బ్రిటిషాంధ్రలోని తెలుగు పండితుడు గోలకొండ పత్రిక 9వ సంవత్సరాది సంచికకు పంపిన ఒక వ్యాసంలో "నిజాం రాష్ట్రమందు ఆంధ్ర కవులు పూజ్యము" అని వ్రాశారు. దానికి దీటుగా ప్రతాపరెడ్డి గారు యిచ్చిన గట్టి జవాబు "గోలకొండ కవుల సంచిక". రెడ్డిగారు ఎంతో శ్రమించి పలువురి సహాయ, సహకారములతో తెలంగాణములోని

354 మంది ఆధునిక సంస్కృతాంధ్ర కవులను, 183 పూర్వాంధ్ర కవుల రచనలతోను వెలయించి, తెలంగాణలోని తెలుగు సాహితీ సౌరభాన్ని గుబాళింపజేశారు. "గోలకొండ కవుల సంచిక" ద్వారా.

## హైందవ ధర్మవీరులు:

గ్రీసు దేశంలోని థర్మోపైలె అను ఇరుకు కనుమ వద్ద 300 మంది స్పార్టకు చెందిన వీరులు తమపై దండయాత్రకు వచ్చిన వేలాది పెర్షియన్ సైనికులను నిగ్రహించి వారి దాడికి విఫలం చేసిన ఘటన గ్రీకు చరిత్రలో వర్ణించబడింది. ప్రతాప రెడ్డి గారు తమ రచనలో మన హిందూ స్థానమందు ఇటువంటి సంఘటనలు వందల కొద్దీ జరిగినా అవి చరిత్రకారుల దృష్టిలో పడలేదు. అందుచేత మనదేశ సంఘటనలు ఎవరికీ తెలియకుండా పోయాయని వాపోయారు. మొదటినుండి భారతీయులకు, చరిత్ర పట్ల ఉపేక్షా భావం కారణంగా మన వేల సంవత్సరాల చరిత్ర పుటలలోకి ఎక్కక పుక్కిటి పురాణం అయింది.

## రామాయణ విశేషములు:

వాల్మీకి రామాయణాన్ని చారిత్రాత్మక పరంగా విశ్లేసించి వ్రాసినది యీ పుస్తకం. రామాయణం క్రీ.పూ. 2500 నాటిదని ప్రతాప రెడ్డి గారు నిర్ణయించారు. గ్రీసు, తదితర పాశ్చాత్య దేశాలలో క్రీ.పూ. 200 సం॥ నాటికి రామాయణం వ్యాపించిందని, గ్రీకు రచయిత హోమర్ తన "ఇలియడ్"ను క్రీ.పూ. 830 ప్రాంతాల రచించి ఉండవచ్చునని, ఆ రచనకు ప్రేరణ వాల్మీకి రామాయణమేనని ప్రతాప రెడ్డి గారి అభిప్రాయం. రామాయణ కాలం నాటి సాంఘికాచారములు, కుల వ్యవస్థ, ప్రజల ఆహారం, దుస్తులు, అలవాట్లు మొదలైనవి కూడ ప్రస్తావించ బడ్డాయి. దీని ప్రచురణ 1939వ సంవత్సరం.

## రాజ బహద్దురు వేంకటరామారెడ్డి జీవిత చరిత్ర:

హైదరాబాదు నగర కొత్వాల్‌గా నియమింపబడిన ఆద్య హిందువు వేంకట రామారెడ్డి గారు. కొత్వాల్ గారి విశిష్ట సేవలను ఉగ్గడిస్తూ ఆయన అకుంఠిత కార్యదీక్ష, నిరాడంబరత, సేవాధృక్పథం ద్వారా సామాన్య ప్రజల మన్ననలను, నిజాము నవాబు గారి మన్ననలను పొందిన వివరాలను ఈ జీవిత చరిత్రలో రచించారు.

## మొగలాయీ కథలు:

నిజాం కాలంనాటి సంఘంలోని రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులకు అద్దం పట్టే కథల సమాహారం ఈ పుస్తకం.

## యువజన విజ్ఞానము:

ఎదిగిపోతున్న బాల, బాలికలు పెద్ద బాలశిక్ష చదివిన తరువాత తెలుసుకోవలసిన, ప్రపంచ జ్ఞాన సంపాదనకు ఉపయోగపడే పుస్తకం యువజన విజ్ఞానము. దీనిలోని అంశములు: ప్రార్థన, నీతి పద్యములు, శకములు, మతములు, భాషలు, ఆంధ్ర వాఙ్మయ చరిత్ర, పండుగలు, భూగోళము, ఆరోగ్య విధులు, ప్రపంచ మహనీయులు, రాజకీయ పరిజ్ఞానము విజ్ఞాన విశేషములు, గ్రామ సమస్యలు. పిల్లలు బాధ్యతయుతంగా, జీవితాన్ని మలచుకోవటం అలవరచే ఉత్తమ గ్రంథం.

దాదాపు మూడున్నర దశాబ్ధాల రచనా జీవితంలో ప్రతాప రెడ్డి గారు 40 పైగా పుస్తకాలు వ్రాశారు. మిగిలిన కొన్ని ముఖ్యమైనవి లిపి సంస్కరణములు, నిజాం రాష్ట్ర పాలనము, సంఘోద్ధరణము, భక్తతుకారాం (నాటకము), ఉచ్చల విషాదము గ్రంథాలయములు, ప్రాథమిక స్వత్వములు, తెలంగాణ ఆంధ్రోద్యమం, హిందూ స్థాన చరిత్ర, రాఘవాభ్యుదయము, కృష్ణార్జున సంవాదము, సురవరం ప్రతాప రెడ్డి పద్యాలు.

మదరాసులో చదువుకుంటున్న రోజులలోనే ఆయన వివిధ సారస్వత పత్రికలు 'మాతృసేవ', 'పినాకిని' 'కళ' మొదలైన వాటికి వ్యాసాలు వ్రాసి ప్రచురించేవారు. 'కళ' పత్రిక శ్రీ పి.వి. రాజమన్నారు గారి సంపాదకత్వంలో వెలువడేది. ఆయన తరువాత కాలంలో మదరాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా చాలాకాలం పనిచేశారు.

ప్రతాప రెడ్డి రచనలు విస్తృత పరిశోధనా ఫలితంగాను, నూతన విషయాలు ఆవిష్కరించునట్లు ఉండేవి. ఆయన శైలిధారాళం, విషయాన్ని సూటిగా, సమగ్రంగా తెలియజెప్పే నైపుణ్యం వారిది.

## శ్రీ సురవరం ప్రతాప రెడ్డి గారి జీవితము, సాహిత్యము గురించి వచ్చిన వివిధ రచనలు

- సురవరం ప్రతాప రెడ్డి జీవితము, సాహిత్యము – డా॥ ఎల్లూరి శివారెడ్డి 1976
- సురవరం ప్రతాప రెడ్డి జీవితము, రచనలు – శ్రీ సుద్దసాని రామిరెడ్డి
- సురవరం ప్రతాప రెడ్డి – డా॥ ఎస్. లక్ష్మణ మూర్తి (ఇంగ్లీషు) 2000 సాహిత్య అకాడమి, న్యూఢిల్లీ ప్రచురణ.
- తెలుగు వైతాళికుడు సురవరం ప్రతాప రెడ్డి – డా॥ ముదిగంటి సుజాత రెడ్డి 2012
- తెలుగు వైతాళికుడు సురవరం ప్రతాప రెడ్డి – డా॥ రావి భారతి
- తెలంగాణ తెలుగు వైతాళికుడు సురవరం ప్రతాప రెడ్డి – శ్రీ గోపీకృష్ణ (సొరకాయల కృష్ణా రెడ్డి)
- శ్రీ సురవరం ప్రతాప రెడ్డి గారి జీవితము రచనలపై సమగ్ర పరిశీలన – డా॥ ఇందుర్తి ప్రభాకర రావు, ప్రచురణ: 2014
- శ్రీ సురవరం ప్రతాప రెడ్డి గారి జీవితము, సాహిత్యము – డా॥ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి 2017
- సురవరం – తెలంగాణం – ప్రధాన సంపాదకుడు శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి 2020

## శ్రీ సురవరం ప్రతాప రెడ్డి గారి పట్ల గౌరవాభిమానములతో ప్రజలు, ప్రభుత్వము, వివిధ సంస్థలు నెలకొల్పిన స్మృతి చిహ్నములు

- హుసేన్ సాగర్ టాంక్‌బండ్ (హైదరాబాదు – సికిందరాబాదు)పై ప్రతిష్ఠింపబడిన ప్రముఖుల విగ్రహాలలో సురవరం ప్రతాప రెడ్డి గారి నిలువెత్తు విగ్రహం.
- మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, ఇటికాలపాడులో ఆయన విగ్రహాలు ఆవిష్కరించారు.
- హైదరాబాదు బషీర్‌బాగ్ లోని ప్రధాన మార్గానికి సురవరం ప్రతాప రెడ్డి గారి పేరు ఉంచారు.
- హైదరాబాదు జర్నలిస్టుల క్లబ్ భవనం సురవరం ప్రతాప రెడ్డి భవనంగా పిలువబడుతోంది.
- హైదరాబాదులోని రెడ్డి విద్యార్థి వసతి గృహ గ్రంథాలయానికి సురవరం ప్రతాప రెడ్డి గ్రంథాలయంగా నామకరణం.
- సికిందరాబాదులోని టెలికాం భవన్‌కు ప్రతాపరెడ్డి గారి పేరు.
- ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగములో ఉత్తమ పరిశోధనా విద్యార్థికి సురవరం ప్రతాప రెడ్డి స్వర్ణ పతకం.
- తెలంగాణ తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాప రెడ్డి పేరు పెట్టాలన్న ప్రతిపాదన ఉంది.

**సాంఘిక సంస్కరణలు, సంస్థలు, ఉద్యమాలు, శ్రీ సురవరం ప్రతాప రెడ్డి గారు ఎన్నో సాంఘిక సాంస్కృతిక సంస్థల స్థాపనలో ప్రముక పాత్ర వహించారు. ఎన్నో ఉద్యమాలకు సారధ్యం వహించి నడిపారు. బాల్య వివాహాలను తీవ్రంగా వ్యతిరేకించి, విధవా వివాహాలను ప్రోత్సహించారు. దేవదాసి సాంప్రదాయాన్ని, అస్పృశ్యతను మాన్పడానికి అవిరళ కృషి చేశారు. వాటిలో కొన్ని:**

1. ఆంధ్ర జన సంఘము (1922)
2. ఆంధ్ర మహాసభ (1930)
3. యాదవ సంఘము
4. గౌడ సంఘము
5. విజ్ఞాన వర్ధినీ పరిషత్తు (1941)
6. ఆంధ్ర (తెలంగాణ) సారస్వత పరిషత్తు (1943)
7. ఆంధ్ర విద్యాలయము (1944)
8. బాలికోన్నత పాఠశాల
9. లక్ష్మణరా పరిశోధనా మండలి
10. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయము
11. హైదరాబాదు ఆయుర్వేద సంఘము
12. ఆంధ్రోద్యమము
13. హరిజనోద్యమము
14. ముదిరాజ సంఘము

అలా తెలంగాణ సమాజానికి, సాహిత్యానికి అవిరళ కృషి సల్పిన ధురంధుణ్ని 57 సంవత్సరముల వయసులోనే 1953 ఆగస్టు 25వ తేదీన విధి మనకు దూరం చేసింది. ఆయన హఠాన్మరణం తెలుగు సాహిత్యరంగాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ సందర్భంలో ప్రతాప రెడ్డి గారి సమకాలికుడు, ప్రముఖ చరిత్ర, శాసన పరిశోధకుడు అయిన శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మ గారి మాటలు స్మరణీయం. “సురవరం ప్రతాప రెడ్డి అసమాన్య ప్రతిభావంతుడు. సాహిత్య క్షేత్రంలో ఆయన దున్నని మడిలేదు. విమర్శకుడిగా, కవిగా, సాహితీవేత్తగా, రాజకీయవేత్తగా, పత్రికా రచయితగా ఇలా ఎన్నో అవతారాలు ఎత్తారు. అన్నిటినీ మించి ఆయన గొప్ప దేశభక్తుడు, దయార్ద్రహృదయుడు, అలాంటివారు చాలా అరుదుగా లభిస్తారు. ఆయనతో స్నేహం ఒక గొప్పవరం. ఆయన మరణం తెలంగాణకే కాదు, విశాలంధ్ర అంతటికీ తీరనిలోటు”. ఈ మాటలు అక్షర సత్యాలు.

**కూర్పు: బొమ్మారెడ్డి రామిరెడ్డి**